శ్రీకాకుళం వార్త



## రాష్ట్రమంత్రులను కలిసిన ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్ఇఆర్

రణస్థలం, జూలై 12ప్రభాతవార్త



రాష్ట్రమంత్రులు కింజరాపు అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, అనగాని సత్యప్రసాద్‌లను శుక్రవారం విజయవాడలో ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గంలోని వివిధ సమస్యలను ఆయన మంత్రుల దృష్టికి తీసుకువెళ్లారు. అనంతరం ఆయన తెదేపా రాష్ట్ర అధికార ప్రతినిధి పట్టాభిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే ఎన్ఇఆర్‌తో పాటు పైడిభీమవరం సర్పంచ్ ప్రతినిధి రౌతు శ్రీనివాసరావు, తెదేపా సీనియర్ నాయకులు పిషిణి జగన్నాధంనాయుడు, ముప్పిడి సురేష్, లంక నారాయణరావు, ఇనపకుర్తి తోటయ్యదొర, కోనేటి శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

## నిర్మాణ పనులు పరిశీలన...

సీతంపేట,జూలై 12 ప్రభాతవార్త



సీతంపేట ఐటిడిఎ పరిధిలో జరుగుతున్న వివిధ నిర్మాణ పనులను ఐటిడిఎ ఇన్‌చార్జ్ పీవో విష్ణుచరణ్ పరిశీలించారు. శుక్రవారం సీతంపేట ఏజెన్సీ ప్రాంతంలో పర్యటించిన పీవో పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేసారు. మొదటిగా ఐటిడిఎ కార్యాలయంతో పాటు పలు విభాగాలను పరిశీలించి వివరాలను అధికారులను అడిగితెలుసుకున్నారు. అక్కడి నుండి ఆడలీ వ్యూపాయింట్ పనులను పరిశీలించారు. నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరితగతిన పనులు పూర్తి చేయాలని ఇంజనీరింగ్ ఇఇ సింహాచలంను ఆదేశించారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. అనంతరం సుందరయ్యగూడలో సుమారు రూ.20లక్షలతో నిర్మిస్తున్న గోకుళం షెడ్డును పరిశీలించారు. అక్కడి నుండి మినీ స్టేడియం, గిరిజన మ్యూజియం, తిరుమల తిరుపతి వేంకటేశ్వర స్వామి దేవాలయం, హెచ్ఎన్‌టిసి ఫాంలను పరిశీలించారు. ఈ పరిశీలనలో పీవో వెంటే ఏపీవో చినబాబు, డిడి అన్నదొర, డిప్యూటి డిఇఓ పి నారాయుడు, డిఇ క్రిష్ణకుమార్ పలు శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్‌కు అంతరాయం

సీతంపేట,జూలై 12 ప్రభాతవార్త

సీతంపేట మండలంలోని శనివారం విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏఇ నీలిమ తెలిపారు. శుక్రవారం ఓ ప్రకటన ద్వారా వివరాలను వెల్లడించారు. విద్యుత్ మరమ్మత్తుల నిమిత్తం శనివారం ఉదయం 8గంటల నుండి సాయంత్రం 3గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

## ఎన్డీఏ బలోపేతమే లక్ష్యం..

సీతంపేట,జూలై 12 ప్రభాతవార్త



ఎన్డీఏ కూటమి బలోపేతమే లక్ష్యంగా గ్రామస్థాయిలో ప్రజాసేవక్ కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు ఎన్డీఏ కూటమి నాయకులు సవరతోట మొఖలింగం, పవన్‌లు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక తెదేపా కార్యాలయంలో ఎన్డీఏ కూటమి నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు పాలకొండ నియోజకవర్గ జనసేన ఎమ్మెల్యే నిమ్మక జయక్రిష్ణ ఆదేశాల మేరకు ఇక పై ప్రజాసేవక్ పేరుతో ప్రతీ గ్రామంలో కార్యకర్తలు పలు సేవా కార్యక్రమాల్లో పాల్గొంటారన్నారు. వీరు ప్రజలతో మమేకమై ఎన్డీఏ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, విధివిధానాలు ప్రజలకు చేరే విధంగా ముందుకు తీసుకువెళ్లాలని నాయకులు చర్చించారు. ప్రజాసేవక్‌లో కూటమికి చెందిన ముఖ్యనాయకులు ఉంటారన్నారు. ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా ఈ ప్రజాసేవక్‌ను తయారుచేస్తామని కూటమి నాయకులు పేర్కొన్నారు. ఈ సమావేశంలో తెదేపా, జనసేన, బిజేపి నాయకులు నీలయ్య, చంద్రశేఖర్, సంతోష్, కె శ్రీకాంత్, సింహాద్రి తదితరులు ఉన్నారు.

## ఫైనాపిల్ విలువత ఉత్పత్తులపై వృత్తి శిక్షణ కార్యక్రమం

బూర్జ, జూలై 12 ప్రభాతవార్త



ఫైనాపిల్ విలువత ఉత్పత్తులపై గిరిజన యువతి యువకులకు వృత్తి శిక్షణ కార్యక్రమం ఆర్ట్స్ సంస్థ, మన్యం సహజ ఉత్పత్తిదారుల కంపెనీ, నాబార్డు సహకారం మరియు కృషి విజ్ఞాన కేంద్రం ఆముదాలవలసలో డాక్టర్ బి.సునీత, గృహ విజ్ఞాన శాస్త్రవేత్త ఆధ్వర్యంలో ఆఖరి రోజు ఫైనాపిల్ స్క్వాష్ మరియు ఫైనాపిల్ జామును తయారు చేయడంపై శిక్షణను ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కె.భాగ్యలక్ష్మి ప్రోగ్రాం కోఆర్డినేటర్ కె.రమేష్‌కృష్ణ, జిల్లా డెవలప్‌మెంట్ మేనేజర్ నాబార్డ్ శ్రీకాకుళం శాస్త్రవేత్తలు, ఆర్ట్స్ ఎన్జీఓకు సంబంధించిన మన్యం సహజ ఉత్పత్తిదారులు సంఘం ఎఫ్‌పిఓ బి.శంకరరావు, సీఈఓ మరియు ఎం.కృష్ణారావు బిఓడి గిరిజన యువతి యువకులు సీతంపేట, కుసిమిగూడ గ్రామస్తులు పాల్గొన్నారు.

## కంచిలి పీఏసీఎస్ అక్రమాలపై దర్యాప్తు చేయాలి

### దోషులపై చర్యలు తీసుకోవాలి -మండల తెదేపా నాయకులు డిమాండ్

కంచిలి, జూలై 12 ప్రభాతవార్త



కంచిలి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అక్రమాలపై విజిలెన్స్ దర్యాప్తు చేయాలని కంచిలి మండల తెలుగుదేశం పార్టీ నాయకుడు మాదిన రామారావుతో పాటు మండల తెలుగుదేశం పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం కంచిలి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ వైఎస్సార్ ప్రభుత్వం హయాంలో కంచిలి పిఏసిఎస్‌లో అనేక అక్రమాలు జరిగాయని పూర్తిస్థాయిలో దర్యాప్తు జరిపితే దోషులు బయటపడతారని అన్నారు. ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్‌బాబు, వ్యవసాయ శాఖ అధికారులతో జరిపిన సమీక్ష సమావేశంలో కంచిలి మండలం నుంచి 20 యూరియా పక్కదారి పట్టినట్లు అధికారులు చెప్పడం జరిగింది. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కంచిలి పీఏసీఎస్‌లో ఒక యూరియా కాకుండా రుణాలు కూడా రైతులకు అందజేయడంలో అవకతవకలు జరిపారని ఆరోపించారు. కంచిలి పీఏసీఎస్‌లో ఐదు సంవత్సరాల్లో జరిగిన లావాదేవీలపై విజిలెన్స్ దర్యాప్తు చేస్తే అనేక అవకతవకలు గుర్తించవచ్చని అన్నారు. ఉన్నతస్థాయి అధికారులు ప్రాథమిక దర్యాప్తు జరిపి కంచిలి పీఏసీఎస్‌ను సీజ్ చేయడం జరిగిందని చెప్పారు. 20 టన్నుల యూరియా గత ప్రభుత్వానికి చెందిన ఒక నాయకుడు ఒరిస్సా ప్రాంతానికి తరలించినట్లు తెలుస్తుందని అన్నారు. ప్రస్తుతం వ్యవసాయశాఖ, సహకార సంఘం శాఖలు చూస్తున్న మంత్రి అచ్చెన్నాయుడుకు దీనిపై ఫిర్యాదు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో బంగారు కురయ్య, తమరాల శోభన్‌బాబు, పిలక చిన్నబాబు, మద్దిల ఆనంద్, మద్దిల భాస్కరరావు, సనపల కామేష్, గుమ్మడి వెంకటరావు, పైల పురుషోత్తం, పైల రామారావు, గరిబుడ్డి మన్మధరావు, తమరాల వెంకటరమణ, జ్ఞానారావు, పూర్ణ, దుబ్బ రామయ్య తదితరులు పాల్గొన్నారు.

## మెళియాపుట్టి గ్రామపంచాయతీలో పారిశుధ్య కార్యక్రమం

మెళియాపుట్టి, జూలై 12 ప్రభాతవార్త



మెళియాపుట్టి గ్రామపంచాయతీలో పారిశుధ్య కార్యక్రమం కూటమి సభ్యులు బసవ పరమేశ్వర్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది జరిపించారు. ఈ కార్యక్రమంలో డ్రైనేజీలు పూడికలు తీయించారు. వర్షాలు పడడం వల్ల డ్రైనేజీలో చెత్త చెదారం ఉండడం వల్ల దోమలు ఎక్కువగా తయారై సీజనల్ జ్వరాలు వచ్చే అవకాశాలు ఉన్నాయి. అందువల్ల డ్రైనేజీలు బాగు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి సభ్యులు బసవ పరమేష్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## అచ్చెన్నాయుడుకు శుభాకాంక్షలు తెలిపిన కలమట వెంకటరమణమూర్తి

టెక్కలి, జూలై 12 ప్రభాతవార్త



ఆంధ్రప్రదేశ్ సచివాలయం అమరావతిలో 4వ బ్లాక్ రాష్ట్ర వ్యవసాయ, సహకార మార్కెటింగ్, పశుసంవర్థక, డెయిరీ డెవలప్‌మెంట్, మత్స్యశాఖల మంత్రిగా కింజరాపు అచ్చెన్నాయుడు బాధ్యతలు చేపట్టిన తర్వాత మొట్ట మొదటిసారిగా సచివాలయంలో తన చాంబర్‌లో ప్రవేశించి మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపిన తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, పాతపట్నం మాజీ శాసనసభ్యులు కలమట వెంకటరమణమూర్తి.

## టిపుల్ ఐటీకి ఆరుగురు విద్యార్థులు ఎంపిక

కొత్తూరు, జూలై 12 ప్రభాతవార్త



మండలంలో మెట్టూరు, కొత్తూరు, నివగాం, కదుము ప్రభుత్వ ఉన్నత, జిల్లా పరిషత్ పాఠశాల పదో తరగతి పరీక్షా ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన ఆరుగురు విద్యార్థినీ విద్యార్థులు ప్రభుత్వ ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. మెట్టూరు జెడ్పీహెచ్ పాఠశాలకు చెందిన బొల్ల సాయిచరణ్ నూజివీడు, దిండిమ ప్రియదర్శిని, యజ్జల జ్యోత్స్నలు శ్రీకాకుళం ట్రిపుల్ ఐటికు ఎంపికయ్యారు. కొత్తూరు ఉన్నత పాఠశాల నుంచి బుయ్యాల నీలిమ శ్రీకాకుళం క్యాంపస్‌కు ఎంపికయ్యింది. కదుము జెడ్పీహెచ్‌ఎస్ నుంచి కిల్లారి దీప్సి కాశ్రీ, నివగా జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన కౌముది రంజిత శ్రీకాకుళం ట్రిపుల్ ఐటికి ఎంపికయ్యారు. తమ పాఠశాల నుంచి ఈ ఏడాది మొదటి సారి ట్రిపుల్ ఐటికి ముగ్గురు ఎంపిక కావడం పట్ల మెట్టూరు జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం డి.లక్ష్మినరసింహ, ఉపాధ్యాయులు విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. అలాగే కొత్తూరు, కదుము, నివగాం పాఠశాలల నుంచి ట్రిపుల్ ఐటికి మొదటి విడతలో ఒక్కొక్కరు ఎంపిక కావడం పట్ల ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు వై.గోవిందరావు, కె.తిరుమలరావు, ఎస్.నిర్మల, ఉపాధ్యాయ సిబ్బంది విద్యార్థులకు, తల్లిదండ్రులకు అభినందనలు తెలిపారు. అయితే మొదటి విడత ట్రిపుల్ ఐటీ ఫలితాల్లో బాలికలదే పైచేయిగా నిలిచిందని చెప్పవచ్చు.

## రాయితీపై బియ్యం, కందిపప్పు పంపిణీ

ఇచ్ఛాపురం, జూలై 12 ప్రభాతవార్త



ప్రజలకు నిత్యావసర ధరలు తగ్గించాలనే ధ్యేయంతో రాయితీపై బియ్యం మరియు కందిపప్పు అందజేస్తున్నట్లు ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. డెయిలీ మార్కెట్ ఎదురుగా ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేశారు. కేజీ కందిపప్పు 160 రూపాయలు, కేజీ సోనామసూరి స్టీం బియ్యం 49 రూపాయలు, సోనామసూరి బియ్యం 48 రూపాయలకు అందిస్తున్నారు. ఒక లబ్ధిదారునికి కిలో కందిపప్పు మాత్రం అందిస్తామని చెప్పారు. సివిల్ సప్లయ్ పర్యవేక్షణలో హోల్‌సేల్ డీలర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో షాపు నిర్వహిస్తారు. కార్యక్రమంలో తహశీల్దార్ అప్పారావు, పట్టణ తెలుగుదేశం అధ్యక్షులు కాళ్ల ధర్మారావు, కొండ శంకర్‌రెడ్డి, గిన్ని చిన్న, కాళ్ల దిలీప్‌యాదవ్, వల్లంపాటి మూర్తి, కమిషనర్ రమేష్, జన్నెల సంతోష్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## బాహుదా నూతన వంతెన నిర్మాణం చేపట్టండి

ఇచ్ఛాపురం, జూలై 12 ప్రభాతవార్త



బాహుదానదిపై నూతన వంతెన నిర్మాణం చేపట్టాలని పట్టణ తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి నందికి జాని కోరారు. ఈ మేరకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడును కోరారు. అమరావతిలో మంత్రి చాంబర్ ప్రారంభం సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు. ఏడాది క్రితం బాహుదా వంతెన కూలిపోగా ఎన్నికల ముందు నిధులు మంజూరు చేయకుండా గత ప్రభుత్వం హడావుడిగా బూటకపు శంకుస్థాపనలు చేపట్టిందని అన్నారు. వెంటనే నిధులు మంజూరు చేసి నూతన వంతెన నిర్మిస్తే ప్రజలకు మేలు కలుగుతుందని చెప్పారు. ఈ సమావేశంలో చెన్నూరు గౌరీ దుర్గాజి తదితరులు పాల్గొన్నారు.

## పశుగ్రాసాలు వల్ల పాల దిగుబడి పెరుగుతుంది


### -పశు వైద్య సహాయ సంచాలకులు లోకనాథం

కోటబొమ్మాళి, జూలై 12 ప్రభాతవార్త

నాణ్యమైన పశుగ్రాసాలు పండించి శాస్త్రీయ పద్ధతుల్లో పశువులకు మేపినట్లయితే అధిక పాల ఉత్పత్తి పెరుగుతుందని కోటబొమ్మాళి పశువైద్య సహాయ సంచాలకులు డాక్టర్ ఎం.లోకనాథం అన్నారు. పశుగ్రాస వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం మండలంలో గల నిమ్మాడలో మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు కింజరాపు హరివరప్రసాద్‌తో కలిసి పాడి రైతులను ఉద్దేశించి మాట్లాడారు. శాస్త్రీయ పద్ధతుల్లో పశువులకు సులభంగా జీర్ణం అవుతుందని, కాల్షియం, భాస్వరం వంటి ఖనిజ లవణాలు మరియు ఎండిఈ వంటి విటమిన్లు మెండుగా ఉంటాయని అలాగే మాంసకృత్తులు, పిండిపదార్థాలు, కొవ్వు పదార్థాలు అధికంగా లభ్యం అవుతాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ట్రిపుల్ ఐటీకి ఎంపికైన ఐదుగురు ఆదర్శ విద్యార్థులు

బూర్జ, జూలై 12 ప్రభాతవార్త



బూర్జ మండలం ఓవిపేట ఆదర్శ పాఠశాల విద్యార్థులు ఐదుగురు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం విడుదల చేసిన ట్రిపుల్ ఐటి ఫలితాల్లో ఆదర్శ పాఠశాల నుంచి ట్రిపుల్ ఐటికి ఎంపికైన దువ్వారపు పవిత్ర, గుమ్మడి యశస్విని, సిహెచ్.చంద్రశేఖర్, ఎం.రఘురాం, పి.వెంకట అప్పారావులకు ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసరావు, సిబ్బంది, ఉపాధ్యాయ సిబ్బంది బోధనేతర సిబ్బంది అభినందనలు తెలిపారు. రాబోయే రోజుల్లో కూడా ఉన్నత చదువుల్లో కూడా వారి ప్రాధాన్యత మెరుగుపర్చుకోవాలని, వారి తల్లిదండ్రులకు విద్య నేర్పే గురువులకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకు రావాలని కోరారు.

## పైనాపిల్ ఉప ఉత్పత్తులతో అధిక లాభాలు

ఆముదాలవలస, జూలై 12 ప్రభాతవార్త




అటవీ ప్రాంతంలో సీజన్‌లో విరివిగా పండించే పైనాపిల్ పండుతో ఉప ఉత్పత్తులు తయారు చేసి విక్రయించడం ద్వారా గిరిజన యువత అధిక లాభాలు పొందవచ్చని కృషి విజ్ఞాన కేంద్రం డాక్టర్ బి.సునీత అన్నారు. శుక్రవారం కృషి విజ్ఞాన కేంద్రంలో చివరి రోజు పైనాపిల్ జామును తయారు చేయడంపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో అటవీ ప్రాంతంలో విస్తారంగా సీజనల్ పంటగా పైనాపిల్ లభిస్తుందని అన్నారు. ఈ పైనాపిల్ ఎన్నో విలువైన పోషక పదార్థాలు ఉన్నాయని ఆరోగ్యానికి ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. కెవికె ప్రోగ్రాం కోఆర్డినేటర్ కె.భాగ్యలక్ష్మి మాట్లాడుతూ పైనాపిల్‌తో ఎన్నో విలువ ఆధారిత ఉత్పత్తులు తయారు చేసి విక్రయించడం ద్వారా గిరిజన యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని అన్నారు. ఉప ఉత్పత్తులు తయారు చేసేందుకు గిరిజన యువతకు తమ కృషి విజ్ఞాన కేంద్రం గృహ విజ్ఞాన శాస్త్రవేత్త ఆధ్వర్యంలో శిక్షణ అందిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కె.రమేష్, కృష్ణ, మన్యం సహజ ఉత్పత్తిదారుల సంఘం ఎఫ్‌పిఓ బెండి శంకరరావు, సీఈఓ ఎం.కృష్ణారావు, బోడ గిరిజన యువతి, యువకులు, సీతంపేట కుషిమిగూడ గ్రామస్తులు పాల్గొన్నారు.

## పార్టీ విజయం కోసం సైకిల్‌యాత్ర

### కంచిలి నుంచి సింహాచలం వరకు తెదేపా నేత దోయస్వామి సైకిల్‌పై యాత్ర -అభినందించిన మండల దేశం నాయకులు

కంచిలి, జూలై 12 ప్రభాతవార్త



ఆంధ్ర రాష్ట్రంలో జరిగిన ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చి ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు పీఠం అధిరోహిస్తే కంచిలి నుంచి సింహాచలం వరకు సైకిల్‌పై యాత్ర చేస్తానని కంచిలి గ్రామానికి చెందిన గుడియా దొయాస్వామి మొక్కుకున్నారు. ఆయన అనుకున్నట్టే జరగడంతో శుక్రవారం కంచిలి పంచాయతీ మఠం కంచిలి గ్రామం వద్ద దివంగత ఎన్‌టిఆర్, కింజరాపు ఎర్రన్నాయుడు విగ్రహాల వద్ద మండల తెలుగుదేశం పార్టీ నాయకులతో కలిసి విగ్రహాలకు పూలమాలలు వేసి సైకిల్ యాత్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా కంచిలి మండల సీనియర్ నాయకులు బంగారు కురయ్య, మాదిన రామారావు, జగదీష్ పట్నాయక్‌లు ఆయనకు తెలుగుదేశం పార్టీ కండువా కప్పి సైకిల్ యాత్ర ప్రారంభించారు. మఠం కంచిలి నుంచి మెయిన్‌రోడ్డు, రైల్వేస్టేషన్ మీదుగా జాతీయ రహదారి వరకు ఆయన వెంట మండల తెలుగుదేశం పార్టీ నాయకులు వంద మంది వచ్చి సంఘీభావం తెలిపారు. ఈ యాత్రకు ఎటువంటి ఆటంకాలు లేకుండా శుభ్రంగా జరగాలని పలువురు కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో కంచిలి మండల తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## వేలంపాట ఖరారు

కోటబొమ్మాళి, జూలై 12 ప్రభాతవార్త

శ్రీకొత్తమ్మతల్లి దేవస్థానంలో భక్తులకు ఫోటోలు, రక్షలు, తాళ్లు విక్రయించు హక్కు కొరకు భక్తులు అమ్మవారికి సమర్పించిన చీరలు, జాకెట్టు ముక్కలను వసూలు చేసుకునే హక్కు కొరకు అలాగే కొబ్బరి చెక్కలు వసూలు చేసుకొనే హక్కు కొరకు శుక్రవారం స్థానిక కొత్తమ్మతల్లి ఆలయ ప్రాంగణంలో టెక్కలి గ్రూపు దేవాలయం కార్యనిర్వహణాధికారి పి.మనస్వి ఆధ్వర్యంలో వేలంపాట నిర్వహించారు. రూ.3,48,000లకు స్వాధీనం చేసుకోగా చీరలు, జాకెట్టు ముక్కలను కోటబొమ్మాళికి చెందిన ఉర్జాన కొండలరావు రూ.87వేలుకు, కొబ్బరి చెక్కలను ఉర్జాన రాము రూ.2,78,000లకు పాట స్వాధీనం చేసుకున్నారు. ఈ మూడు పాటలపై గతం కంటే రూ.34,400లు అదనంగా వచ్చిందని ఈఓ వాకచర్ల రాధాకృష్ణ తెలిపారు.

## చంద్రబాబు సారధ్యంలో రాష్ట్రానికి మహర్దశ

### - మాజీ ఎమ్మెల్సీ విశ్వప్రసాద్

బూర్జ, జూలై 12 ప్రభాతవార్త



తెలుగుదేశం పార్టీ అధినేత, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సారధ్యంలో రాష్ట్రానికి మహర్దశ పట్టనుందని మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాదరావు అన్నారు. అధికారం చేపట్టిన 30 రోజుల్లోనే 30 కార్యక్రమాలను అమలు అమలు చేసిన ఘన కూటమి ప్రభుత్వానికి దక్కిందని శుక్రవారం మండలంలోని టి.ఆర్.రాజుపేట గ్రామంలో ఆయన స్వగృహం వద్ద విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. 30 రోజుల్లోనే 16,347 టీచర్ పోస్టులతో మెగా డిఎస్సీ నోటిఫికేషన్, వృద్ధాప్య, వితంతు పెన్షన్ రూ.4వేలు పెంపు, దివ్యాంగుల పెన్షన్ రెట్టింపు చేసి రూ.6వేలుకు పెంపు, ప్రభుత్వ ఉద్యోగుల ద్వారా ఇంటి వద్దే పెన్షన్ పంపిణీ చేపట్టారు. ముఖ్యంగా ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేయడం, ఉచిత ఇసుక అమలు చేయడంతో పాటు ఆగస్టు 15 నుంచి 183 అన్న క్యాంటీన్ల ప్రారంభానికి ఏర్పాట్లు చేయడం గర్వించదగ్గ విషయమన్నారు. రాజధాని అమరావతి పనులు ప్రారంభం, తల్లికి వందనం మార్గదర్శకాలు విడుదల చేయడంతో పాటు మరెన్నో కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారని ఆయన అన్నారు. ప్రజల రుణం తీర్చుకునేందుకు తాగునీరు, సాగునీరు, రోడ్లు, కాలువలు వంటి అభివృద్ధి పనులతో పాటు మరెన్నో సంక్షేమ పథకాలను అందించి వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలని ఆలోచన చేస్తున్నారన్నారు.

## వాహనాల చోరీ కేసులో ఇద్దరు అరెస్ట్

ఆముదాలవలస, జూలై 12 ప్రభాతవార్త



మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల వాహనాలు చోరీలు జరగడంపై ఆముదాలవలస పోలీసులు దృష్టి సారించారు. శుక్రవారం తనిఖీల్లో భాగంగా వైఎస్సార్ జంక్షన్ వద్ద బైక్‌పై వస్తున్న బొమ్మలాట మహేష్, శ్రీనివాసరావును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బైకులకు ఎటువంటి ఆధారాలతో పాటు పొంతన లేని సమాధానాలు చెప్పడంతో గట్టిగా ప్రశ్నించడంతో పలు బైకులు దొంగతనం చేసినట్లు వెల్లడించారు. మెట్టెక్కివలస, పెద్దజొన్నవలస, ఎచ్చెర్లలో సుమారు ఆరు వాహనాలు దొంగిలించినట్లు పోలీసుల పరిశీలనలో వెల్లడైంది. బొమ్మలాట మహేష్‌ది మంగవారితోట, శ్రీనివాసరావుది మొండేటివీధి. ఇద్దరిది శ్రీకాకుళం అని ఆముదాలవలస సీఐ దివాకర్ యాదవ్ తెలిపారు. వీరిపై ఎప్పటికీ శ్రీకాకుళం, లావేరు, నరసన్నపేటలో గతంలో ఇద్దరు ముద్దాయిలపై కేసు నమోదైనట్లు ఎస్సై కె.వెంకటేష్ తెలిపారు. ముద్దాయిలపై కేసులు నమోదు చేసి కోర్టుకు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

## కౌలు రైతుల సమస్యల పరిష్కారానికే సదస్సులు

వీరఘట్టం, జూలై 12 ప్రభాతవార్త



కౌలు రైతుల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులను నిర్వహించడం జరుగుతుందని, దీన్ని కౌలు రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలుగుదేశం పార్టీ అరకు పార్లమెంటరీ ప్రధాన కార్యదర్శి పొన్నాడ నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం మండలంలోని బొడ్లపాడు గ్రామంలో కౌలు రైతులు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు మేలు చేయాలనే దృక్పథంతో ముందుకు సాగుతుందని రైతులకు అండగా ప్రభుత్వం ఉంటుందని ఆయన అన్నారు. రైతులకు అవసరమయ్యే విత్తనాల నుంచి ఎరువులు, పనిముట్లు, ఇతర సదుపాయాలను ప్రభుత్వం రైతులకు సమకూరుస్తుందని ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు పి.కృష్ణవంశీ, వీఆర్వో పొన్నాడ వెంకటరఘుకుమార్, కీర్తిసుధ, ఉమ్మడి శ్రీకాకుళం జనసేన పార్టీ సంయుక్త కార్యదర్శి, గ్రామ జనసేన నాయకులు జనసేన జాని, సచివాలయ సిబ్బంది, రైతులు, మహిళలు పాల్గొన్నారు.

## మండలంలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమం

సంతబొమ్మాళి, జూలై 12 ప్రభాతవార్త



సంతబొమ్మాళి మండలంలోని పలు పంచాయతీలలో శుక్రవారం ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ ఉమాసుందరి పెద్దతుంగాం, చిన్నతుంగాం, తాళ్లవలస గ్రామాల సచివాలయంను సర్పంచ్ సిమ్మ గోవిందరావు, గున్న జానకమ్మ ఆధ్వర్యంలో సందర్శించారు. గున్న జానకమ్మ వరుసగా మరియు డిడిఓ అన్ని కార్యనిర్వాహకులు, ఏఎన్ఎం, ఆశాలు ఈ ఫ్రైడే డ్రైడేలో పాల్గొని జాగ్రత్తలు తీసుకోవడం, తరచుగా చేతులు కడుక్కోవడం, పరిసర ప్రాంతాలను చక్కగా మరియు పరిశుభ్రంగా నిర్వహించడం, లార్వా నిర్మాణ ప్రక్రియ జరగకుండా నియంత్రించడం గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ విస్తరణాధికారి గోపాలరావు, సచివాలయం డిడిఓ సిబ్బంది పాల్గొన్నారు.